# మట్టి జీవితాలు

"ఓరి సెంద్రిగా!" కేకేసి పిలిచిండు కొమురయ్య.

చంద్రయ్యలో ఉలుకులేదు, పలుకు లేదు. ఎండిన మొక్కలా స్తబ్దుగా పొలంగట్టుమీద కూసున్నడు.

మేఘాల్ని మింగేసి ఆకాశం మౌనముద్ర దాల్చినట్టు, వేదనా తరంగాల్ని అంతరంగంలో అదిమేస్తూ గంభీరవదనంతో ఉన్నాడు.

అరచేతిని కళ్లకు అడ్డం పెట్టుకొని ఆకాశం వంక ఆశగా చూసిండు. వయసు చూపునింకా మసక బార్చకపోయినా ఆకాశం మాత్రం అలుక్కుపోయినట్టే కన్పించింది.

కురిసే మేఘం కరువయ్యింది. కనుమరుగయ్యింది. పెదవ్విరిచాడు.

చేయి తొలగించి కిందికి చూపు మరల్చిండు. పగిలిన అతడి గుండెలా పగుళ్లు బారి ఉందా భూమి.

"ఎట్ల దున్నుడు? ఎప్పుడు సాగుజేసుడు? ఆన పడాల్నాయె, తూములు పరుగులు పెట్టాల్నాయె, భూమి తడవాల్నాయె" అనుకుంటూ విలవిల్లాడిండు.

గుడిపేట చిన్నపల్లె. ఆయకట్టేతర ప్రాంతమది. చట్టుప్రక్కల ఊళ్లన్నీ అంటే మండలానికి మండలం వర్షాధార పంటపొలాలే. వర్షం పడాలె, చెరువులు నిండాలె. అప్పటిగ్గాని బావులల్ల నీళ్లు కనవడ్తయ్.

అందుకనే అందర్లాగానే ఆనకోసం ఎదురుసూత్తున్నడు చంద్రయ్య. ఆనకాల మచ్చింది. ఏదీ, సిన్న సినుకు లేదు. పోనీ మృగశిరకార్తెతోనన్నా ఆనలత్తయని మురిసిపోయిండు. ఊరి పొలిమేర్ల నుంచి గూడ కొంచమన్న మట్టివాసన తగులకపాయె.

ఆవేదన సుడులు తిరిగింది. ఆలోచన్లు నరాల్ని మెలిపెట్టినయ్.

దోసిలి నిండార ఎండిన పొలం మట్టి తీసుకొని నుదురుగ్గొట్టుకున్నడు.

"అరేయ్ సెంద్రీ" చంద్రయ్య దగ్గరకు అచ్చిన కొమురయ్య మరింత బిగ్గరగ పిలిసిండు.

ఆ పిలుపుకీసారి ఆలోచన్ల నుండి బయటపడిండు.

"ఏందిర. గీడ గుసోనేంజేత్తున్నవ్?" మందలిస్తూ పక్కనే గూసున్నడు కొమురయ్య.

దోస్తుదిక్కు నిర్లిప్తంగా చూసి "మట్టిని నమ్ముకొని బతుకుతున్నందుకు నోట్లింత మన్నువడే కాలమచ్చెర" లోపలి బాధను బయటవెట్టిండు.

"గీడ గూసొని ఇచారం జేత్తె ఆన వడ్తదార"

"ఏం జేసుడుర కొమ్రు. గప్పట్ల గిట్లుండెనా? ఎన్కట మన అయ్యల కాలంల సినుకెనుక సినుకు సిందులు తొక్కలేద్ర"

"బగవంతునికి రైతుమీద దయలేదుర. ఎవుసం లేంది మనమెట్ల?"

"నువద్దిగనే. రైతుకి భూమి, భూమికి నీళ్ళు గావాలె గదర. నీళ్ల లేక గోసగోస గావట్టె. నీళ్లకు కరువచ్చె. కరువు రైతుని ముంచవట్టె. మనిషి బతుకుడెట్లరా"

"అరద కాల్వలు తోడిత్తమని ఎన్నికల్ల జెప్పి మన యమ్మెల్లె గూడ గెల్సె. యాడాద్దాటె, గింతదాకా గా ఊసే రాకపాయె"

"తిందామంటె ఆళ్లకే పైసలు దొర్కుతలేవంటే గాల్లింక అరద కాల్వలు తోడిత్తరంటె కల్ల"

"మన బత్కులు గిట్లనే ఉండాల్నని రాసిపెట్టుంటె ఎవలేం జేత్తరుగని. ఊళ్లెకోదాం పార" అంటూ నడుముకున్న పంచెవిప్పి ఒక మల్క దులిపి, తలపాగ సుట్టుకుంటు లేసి నిలవడ్డడు కొమురయ్య.

చంద్రయ్య దిక్కు సూసిండు లేత్తున్నడేమోనని.

సినుకు పడితెగాని మొలకెత్తనని మొండికేసిన విత్తనం లెక్క... కూసున్న కాన్నుండి లెవ్వలేదు చంద్రయ్య.

"పొద్దాత్తె తెల్లార్తె సేనుకాడికి అచ్చుడు, ఎండి ఎముకల్దేలిన పొలం బూవుల్ని జూసుకుంటు కండ్లల్ల నీళ్లు పెట్టుకునుడు బగ్గనే ఉందిగని... మాకు లేదుర ఏడ్పు. తెల్లార్తెట్లుంటె గట్లయితది గని పా. పెండ్లాం పోరగాండ్లని గూడ పట్టించుకోవాలె గాదుర" మందలించిండు కొమురయ్య.

భారంగా లేసి కొమురయ్యతో ఇంటివైపుకి కదిలిండు చంద్రయ్య.

✣ ✣ ✣

భార్య పొద్దుటినుండి బతిమిలాడంగ బతిమిలాడంగ పొద్దుగూకంగ బలిమీటికి కంచం ముందు కూసున్నడు చంద్రయ్య. పిల్లగాండ్లు బయటాడుకుంటున్నరు.

లచ్మి బువ్వ వెట్టింది.

ముద్ద మింగుడు వడ్తలేదు. బువ్వ కలుపుతలేడు. కెలుకుతున్నడు. కండ్లు కంచం దిక్కే ఉన్నా సూపులు శూన్యాన్ని తడుముతున్నయ్. పెనిమిటి స్థితికి తమ దుస్థితికి గుండె కలుక్కుమందా ఇల్లాలికి.

"తినయ్యా! ఎట్ల జరిగేదుంటే గట్ల జరుగుద్ది, కట్టాలల్ల పుట్టినోల్లం కన్నీల్లకు బయపడితెట్ల? కడుపుని కట్టేసుకుంటే కట్టాలు తీర్తయా? నా మాటిని గింతంత ఎంగిలిపడయ్యా?" బతిమిలాడింది పెనిమిటిని.

"నిరుడు సంది ఆనల్లేక ఎవుసం జేయకపోతిమి. తిండి గింజల్లేక అరెకురం సేను షావుకారి కాడ కుదువపెడ్తిమి. ఇది అప్పుకూడే. ఎట్ల మింగుడు. పెయినవడ్తదా? తలుసుకుంటే కడుపు తరుక్కుపోతంది" బాధని పెదాలమద్దెన బిగవట్టిండు.

"బగవంతుడు మనకి అన్నాయం సెయ్యడయ్యా! గివన్నీ మతిన పెట్టుకోక ముద్ద మింగయ్యా" ఓదార్పుగ అన్నది.

కండ్లల్ల నీళ్లు సుడులు తిరిగినయ్. ఆపుకున్నడు.

బలవంతంగా రెండు ముద్దలు మింగేసి ఆరుబయటకు నడిసిండు. ఆశ సావక అలవాటుగా తలెత్తి మొగులు దిక్కు సూసిండు. పెయ్యి జలదరించింది.

వెన్నెల అద్దంలో ఆకాశమంతా మబ్బులు. కారు మబ్బులు. సల్లని గుట్టలన్నీ పోగయి ఆకాశాన్ని ఆక్రమించినట్టుగా మేఘాలు!

ఆ దృశ్యం చంద్రయ్య కనుపాపల ఉపరితలాలపై కమనీయ చిత్తరువై కదలాడుతుండగానే గాలి పొరల్ని చీల్చుకుంటు చెవిని సోకిందా శబ్దం.

'టప్!'

ఉద్వేగాన్ని అణచుకోలేకపోయాడు.

శరీరంలోని అణువణువూ ఆనందంతో కంపిస్తుంటే-

"లచ్మీ!" అనరిచిండు.

ఆ కేకకి "ఏవయ్యిందయ్యా?" అంటూ బయటకురికొచ్చిన లక్ష్మి స్థాణువైపోయి నిలబడింది.

ఆకాశం మూట చిట్లి... నక్షత్రాలు నేలరాలుతున్నట్లు... బొట్లు బొట్లుగా వర్షపు బిందువులు...

ఉద్వేగంతో ఊగిపోతున్న పెనిమిటి భుజాల్ని సుతిమెత్తగా నొక్కి వదిలింది లక్ష్మి. భార్యని దగ్గరకు తీసుకున్నడు ఆప్యాయంగా.

వర్షం ఉధృతమవుతుండడంతో లోనికి నడిచారిద్దరు.

ఒక్కటొక్కటిగా పోటీపడిన చినుకులు మరిక ఆగలేదు. చాన్నాళ్లకి అమ్మమ్మ ఇంటికి వచ్చిన చిన్నారుల్లా నేలతల్లిని తడుముతూనే ఉన్నాయ్.

ఆగకుండా మూడ్రోజులు ముసురే ముసురు.

పల్లెలు నవ్వినయ్. వ్యవసాయం పనులు మొదలైనయ్.

చంద్రయ్య ఆనందానికి పట్టపగ్గాల్లేవు. నాగలి భుజాన వేసుకొని పొలందిక్కు కదిలిండు. సద్దిమూట తీస్కొని లక్ష్మి భర్తకి తోడయ్యింది.

ఊరు ఊరంతా ఉత్సాహంతో ఉరకలు వేసింది. ఆలస్యంగనన్నా ఎవుసం పనులు

ఊపందుకున్నయ్. నారు మడులల్ల పోసింద్రు. నాట్లు వేసే కాలమచ్చింది.

✣ ✣ ✣

కాలం గడుస్తోంది.

ఊర్లె ఎటుజూసిన పచ్చంగ పైరు. పెట్టింది మూడ్రోజుల ముసురే అయినా ఆ పల్లెతల్లికి వసంతం వచ్చినట్టయ్యింది. అందరికంటె చంద్రయ్య పొలం ఎత్తుగా, ఏపుగా పెరిగింది.

అదే మాటంటున్నడు కొమురయ్య చంద్రయ్యపొలం కాడికచ్చి.

"ఏంద్రా సెంద్రిగా ఈయేడు నీ పొలం యమ జోరుగుందేందిరా?"

"అవున్రా అంతా పైరుతల్లి దయ" వరిపైరుకి రెండు చేతులెత్తి జోడించి అన్నడు చంద్రయ్య.

"జల్ది సేతికత్తయని అందరం 'జేజీయల్లే' కదర ఏసింది" కొమురయ్య అడిగిండు.

"అవును మల్ల"

"మాకు తెల్వకుండ నువ్వు మల్లొకటెయ్యలేదు గద" అంటూ నవ్విండు.

"గిదేందిరో గట్లంటవు. అందరం బోయే 'పొలాస ఫాం'కాడ తీస్కచ్చుకున్నం గదర"

మాటల మధ్యన రాజిరెడ్డి వచ్చిండటు.

"రాజిరెడ్డి పటేలా! నాట్లేసుడైనయా?" అడిగిండు చంద్రయ్య.

"నేనీసారి మక్కేసిన" చెప్పిండు రాజిరెడ్డి.

"సగమూరు మక్కేసిన్రు. పటేల్లంత మక్కనే ఏసిన్రు. మనమేందిర సెడబుద్ధి పుట్టినట్టు వరేసినమ్?"

మూడ్రోజులు మురిపించి మల్ల వానజాడ కనవడకపోయేసరికి వరిపైర్ల గురించి ఫికరు పెట్టుకుండు కొమురయ్య.

"సూద్దాం. గీయేడన్నా బాయిలల్ల నీటి సుక్కలు సూడకపోతమా?" ధైర్యం సెప్పిండు చంద్రయ్య.

"ఎవరదురుట్టం ఎట్టుందోలే..." కల్పించుకున్నడు రాజిరెడ్డి.

"ఊర్లె ఏదో సంగతి ఇనవడ్తుంది. నువద్దిగనేనా పటేలా?" కుతూహలంగ అడిగిండు కొమురయ్య.

కాద్దో గొప్పో చదువుకున్నడు రాజిరెడ్డి. దగ్గర్లో ఉన్న మండలానికి తరచూ రాకపోకలు సాగిస్తుంటడు. రాజకీయ వాసనల్లా తెలుసు.

"ఏ విషయం?" అడిగిండు రాజిరెడ్డి.

"అదే కాల్వపనులు..." అన్నడు కొమురయ్య.

"నిజంగనే. మన మండలం గుండా అరదకాల్వ పనులు సాంక్షనైనయ్. మొన్న కల్సినపుడు స్వయంగ ఎమ్మెల్యే సెప్పిండు" అన్నడు రాజిరెడ్డి.

"గట్లయితే మనూర్లో సింగిడి (హరివిల్లు) పొడిసినట్టే" సిన్నపిలగాన్లెక్క సంతోషం

వ్యక్తపరిచిండు చంద్రయ్య.

"సాగునీటికోసం ఎన్నాళ్లయ్యిందో ఎదురు సూడవట్టి. అరదకాల్వ పున్నెమా అని కొన్ని వేల ఎకురాలకి లాభమైతది. భూగర్భ జలాలు నిలువుంటయ్" చెప్పిండు రాజిరెడ్డి.

"మన ఎమ్మెల్లే మాట నిలవెట్టుకుండు" కొమురయ్య అంటుంటె మొకం పత్తిపువ్వోలె విచ్చుకుంది.

"మరి నేను పోత" అన్నడు రాజిరెడ్డి.

"ఎటు బైలెల్లినవ్ పటేలా?" చంద్రయ్యఅడిగిండు.

"మనూర్లె ఏ బాయిల్నన్న నీళ్లు పడ్డయా అని తిరిగి సూత్తున్న. ఇటేపు బాయిలల్ల నీళ్లు బగ్గెం లేనట్టున్నయ్" అంటూ పోయిండు రాజిరెడ్డి.

చంద్రయ్య, కొమురయ్యలవి పక్క పక్క పొలంలే. ఇద్దరూ ఎవరి పనులల్ల వాళ్లు మునిగిపోయింద్రు.

కోటి ఆశలతో ఖరీఫ్ పనులు చేపట్టిన రైతులకు తొలకరి వర్షాలతో ఆశాజనకమైన పరిస్థితులు కనబడ్డా చెరువులు, బావుల్లల్లో ఆశించిన మేరకు నీరు చేరకపోవడంతో ఆందోళన చెందసాగారు.

మంచిపంట మాట దేవుడెరుగు. పెట్టిన పెట్టుబడి చేతికి అందుతదో లేదోనని రైతులు వాపోతున్నరు.

✣ ✣ ✣

ఆగిన వర్షాలకు బావులు నిండక పొలాలు ఎండిపోతున్నయి. పొలాలకి నీరు కట్టుడు లేక, చేసే పనేం తోచక చంద్రయ్య పొలంవైపు బయల్దేరిండు కొమురయ్య.

అక్కడ క్రేన్‌తో బాయిపని నడుస్తుంది.

"బాయి లోతు తోడిత్తన్నవా సెంద్రయ్యా" అడిగిండు కొమురయ్య.

"కాదుర పూడిక తీయిత్తున్న" చెప్పిండు చంద్రయ్య.

"నీళ్లూర్తయంటావా?"

"సూడాల్రా! బగవంతుని దయ, మన ప్రాప్తం. ఎదుగుతున్న వరిపైరు ఎండి ఎర్రగప్పయి పోతుంటే సూడ్లేక పోతున్నర. నీయవ్వ! అప్పుల అప్పు పూడికైతే తీయిత్తున్న"

"ఏమోరా? నాకైతే పిస లేత్తంది. వరి ఏసేది లేకుండె. మక్కేసినా మంచిగుండేమో" బుర్ర గోక్కుంటూ అన్నడు కొమురయ్య.

"అయిపాయె, గిప్పుడనుకుంటె ఏం లాబం"

"ఏమోరా! ఎవుసాన్ని నమ్ముకుంటే ఎండుగడ్డి పుట్టేట్టు లేదు"

"నిండా మున్గినోల్లం. సలికో, సావుకో బయపడితే ఎట్టరో" ధైర్యం చెప్పిండు చంద్రయ్య, మట్టినే నమ్ముకున్న మనిషి అతను.

అప్పుడు ఉరిమిందో ఉరుము, రెండ్రోజుల్నుండి కొంత మబ్బు మబ్బుగానే ఉంటుంది. హఠాత్తుగా వాతావరణంలో మార్పొచ్చింది.

"వాన అచ్చేటట్టుంది" అన్నడు కొమురయ్య పైకి చూసి.

"కాలమంత అయిపోతుంటే గిప్పుడీ ఆనేందిరో? ఉన్న పొలాలు నాశనమైతయ్" కంగారుపడ్డాడు చంద్రయ్య.

వర్షం మొదలైంది...

"బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి అంతకంతకూ బలపడ్తోంది. రానున్న నలభై ఎనిమిది గంటల్లో వర్షం ఉధృతి పెరిగిపోవచ్చు" అంటూ వాతావరణాన్ని ఎప్పటికప్పుడు రేడియోలు, టివిలు ప్రకటిస్తూనే ఉన్నాయి.

ఏకధారగా తుపాను వర్షం కురుస్తున్నది. చెరువులు, బావులు, కుంటలు, పొంగి పొర్లుతున్నాయి. తూములు ఏరులై పారుతున్నాయి. వరద పల్లెల వాకిట నీటి ముగ్గయ్యింది.

ఏటవాలులో ఉన్న పంటపొలాలు, చేన్లు నీటి అక్కున చేరాయి.

ముంపుకు గురయ్యే గ్రామాల్లో ముత్యంపేట, సర్వపల్లి, గుడిపేట తదితర గ్రామాలను చేరుస్తూ... గ్రామాలను వదిలిపొమ్మని తుపాను హెచ్చరికలు వెలువడ్డాయి.

"నాడు నీరులేక కరువు ముంచింది. నేడు కన్నీరై అరద ముంచుతుంది" వాపోతూ భార్యాపిల్లల్ని ఎంటేసుకొని ఊరి జనంతో కలిసి పట్నంవైపు కదుల్తూ తలతిప్పి వెనుదిరిగి చూసిండు చంద్రయ్య.

చెరువు కట్ట తెగి పెరిగిన నీటిమట్టానికి పల్లెపల్లెంతా కాగితపు పడవలా కనవడ్డదతని కన్నీటి పొరకు.

✤ ✤ ✤

చంద్రయ్య కోలుకోవడానికి సాన్రోజులు పట్టింది.

జగిత్యాలలో ఉండే సడ్డకుని ఇంట్లో తలదాచుకున్నడిన్నిరోజులు. హఠాత్తుగా పొలం యాదికొచ్చింది. ఊరు కండ్లల్ల మెదిలింది. ఉండబుద్ధి కాలేదింక. ఇంట్ల చెప్పి బయల్దేరిండు.

ఊరే లేదక్కడ. సగానికి సగం తుడిచిపెట్టుకుపోయింది. చెరువు ఎండినంక ఎట్లుంటదో మిగిలిన సగం అట్లుంది. పాణమంత ఇల ఇల్లాడింది.

కొత్తకొత్త మనుషులు తచ్చాడ్తున్నరు. ఏదో జరుగుతుంది అనుకున్నడు. పాత మొహాల కోసం లెంకుతుంటే కనవడ్డడు రాజిరెడ్డి. ఎవ్వల్నో ఎంటేసుకొని ఉరికచ్చినట్టు అచ్చిండు చంద్రయ్య దగ్గరికి.

"మంచిగున్నవా చంద్రయ్య" తనే మాట కల్పిండు.

తలూపిండు.

"ఎవుసం సేద్దమని అచ్చినవా" అన్నడు పెద్దపెట్టున నవ్వుతూ.

బిక్కమొగమేసిండు చంద్రయ్య.

"సేత్తవా" నవ్వాపి మల్ల వెటకారమాడిండు.

గుడ్లనీరు గుడ్లల్లనే కుక్కేసుకుని ఏం మాట్లాడలేదు చంద్రయ్య.

"నీ బాధ నాకర్థమైంది. మనూరోళ్లందరికి గిదే రంది గద. బూవులు పోయినోళ్లందర్కి పట్టానెంబర్లతో కోర్టుకు పోతే పైసలిత్తున్రు. అందరం అదే పన్లె ఉన్నం." కొత్త సంగతి సెప్పిండు.

"యాడికి వోవుడు?" చంద్రయ్య గొంతు పెగిలింది.

"నువ్వేడికి వోవుడ్లేదు. ఇదిగో ఈ మనిషి సుదర్శనం. ఏజంట్. మనసొంటోల్లను వకీలు కాడికి తీస్కపోతడు. ఆడికోయినంక వకీలు సెప్పినకాడ సంతకం... అదే ఏలిముద్రేత్తె సాలు" చెప్పి సుదర్శనాన్ని పరిచయం చేసిండు చంద్రయ్యకు.

సుదర్శనం గబుక్కున చంద్రయ్య చేతిలో చేయి కలిపిండు.

"వకీలుకింత ఫీజు... సుదర్శనానికింత కమీషను... ఇచ్చుకోవాల మల్ల" కండీషన్లు ముందే చెప్పిండు రాజిరెడ్డి. సుదర్శనం తనకిచ్చే వాటా విషయం నొక్కిండు.

"గట్లనే" గొర్రెలెక్క తలూపిండు చంద్రయ్య.

సుదర్శనం తన బైక్ మీద చంద్రయ్యను వకీలుకాడికి తోల్కపోయిండు. రాజిరెడ్డి ఇంకెవలినన్న దొరకవట్టుకోవాల్నని పనిలో మునిగిపోయిండు.

వకీలు తీస్కునేది ఫీజు కాదు... పర్సంటేజి. వచ్చిందాంట్ల సగానికి సగం. ఏలిముద్రేసినంక సెప్పిండు. ఒప్పుకోక తప్పలేదు చంద్రయ్యకు.

'తనకొక్కడికే గిట్ల కాదు గదా' అనుకున్నడు.

రాజకీయంగా పవరు, వకీలుగా పేరుజేయవట్టి తనకాడికచ్చినోల్లందరికి పైసలు తొందరగనే వచ్చేటట్టు చేసిండు వకీలు. నాలుగున్నర లక్షలకు అవి ఇవి పోను, వాళ్లకి వీళ్లకి పంచంగ పంచంగ చంద్రయ్యకు రెండు లక్షలు మిగిల్నయి.

మల్లెక్కడనన్న ఎవుసం భూమి కొందమని చూసిండు. సడ్డకున్ని ఎంటేసుకొని తిరిగిండు కరీంనగర్ జిల్లా అంతా. ఏడజూసిన ధరలు బగ్గున్నయ్, భగ్గుమంటున్నయ్.

కొనబోతే కొరివి అమ్మబోతే అడవి అంటే ఇదేనేమో!

ఎకురానికి మూడు, నాలుగు లక్షలకు ఏడ తక్కువ లేవు. మరి తన పదెకురాల పొలమమ్మితే ఎంతచ్చింది?

**"అన్నింట్ల మునుగుడే అయితంది...**

**ఛీ! మట్టి జీవితం..."** అనుకున్నడు.

ఈ లెక్కన తనకాడున్న పైసలకు అరెకురం అత్తె మా ఎక్కువ. ఆ అరెకురం కొని ఏం జేసుకునుడు? భార్య పోరుతో... సడ్డకుని సలహాతో... జగిత్యాలలోనే ఎక్కడో దూరాన అరగుంట ఇండ్లభూమి కొనుక్కున్నడు. గుంటకు లక్షలు లక్షలే మరి!

లక్ష్మి పనేం జేసుకునుడు? చెల్లె దగ్గర బీడీలు సుట్టుడు నేర్చుకుంది. చంద్రయ్యకేమో సడ్డకుల్లెక్క ఆటో తోలాలన్పించలేదు. తెల్సినోళ్ల దగ్గర పనికి కుదిరిండు.

అది రియల్ ఎస్టేట్ బిజినెస్! అక్కడాఫీసులో చివరకు పనోడిగా కుదిరిండు చంద్రయ్య.

(6-12 జులై, 2008)

**గురజాడ స్మారక కథల పోటీలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ**

*